
వెంగళరావునగర్‌లో ఓటు వేసిన అనంతరం నాయకులు, కార్యకర్తలతో కార్పొరేటర్ దేదీప్యరావు


ఖైరతాబాద్‌లో ఉదయం 7 గంటలకు పోలింగ్ బూత్‌లో మొదటి ఓటు వేసిన ఓ కుటుంబసభ్యులు


బంజారాహిల్స్ రోడ్డు నంబర్- 12లో ఓటు వేసిన డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సింగిరెడ్డి రోహిణ్‌రెడ్డి

ప్రశాంతంగా పోలింగ్

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో సోమవారం ఎంపీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఓటర్లు ఉదయం 7 గంటల నుంచే ఓటు వేసేందు కు బారులు తీరారు. పలువురు వృద్ధులు వీల్ చైర్లలో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

- జోన్ బృందం, (ఆంధ్రజ్యోతి)


ఖైరతాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ భవనంలో ఓటు వేసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి


ఎస్ఆర్‌నగర్‌లో వృద్ధుడిని వీల్ చైర్ మీద తీసుకొస్తున్న పోలీసులు, సిబ్బంది


పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న వృద్ధులు


ఎంఎస్ మక్తాలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు


ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ డిప్యూటీ మేయర్ ఫసియుద్దీన్


ఓటు వేసిన మధురానగర్ కాలనీ సంక్షేమ సమితి అధ్యక్షుడు సాంబశివరావు, కాలనీ వాసులు


షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కుటుంబం


ఓటు వేసిన కాంగ్రెస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి నవీన్‌యాదవ్



మధురానగర్‌లో ఓటు వేసిన సినీ రచయిత వెనిగల రాంబాబు దంపతులు, సినీ దర్శకుడు రేలంగి నర్సింగరావు


ఓటు వేసిన మాజీ కార్పొరేటర్ మామిడి నర్సింగరావు, లక్ష్మీబాయి దంపతులు



ఓటు హక్కు వినియోగించుకున్న స్టార్ ఆస్పత్రుల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపిచంద్ మన్నం దంపతులు, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ గూడపాటి దంపతులు


ఓటు వేసిన కార్పొరేటర్ సీఎన్ రెడ్డి


ఓటు వేసిన కార్పొరేటర్ వెంకటేష్

బీటెక్ చదివాడు.. బెట్టింగుకు బానిసయ్యాడు

- గొలుసు కాజేసిన యువకుడి అరెస్ట్

పంజాగుట్ట, మే 13 (ఆంధ్రజ్యోతి): బీటెక్ చదివాడు.. ఉద్యోగం కోసం నగరానికి వచ్చాడు. ఓ ప్రైవేట్ హాస్టల్లో ఉంటూ.. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసయ్యాడు. అప్పుల పెరిగి డబ్బుల కోసం ఓ ఇంట్లో చొరబడి వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు దోచుకెళ్లిన నిందితుడిని పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి నాలుగు తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా పొన్నూరు మండలం దొప్పలపూడి గ్రామానికి చెందిన కొండేటి నాగపృథ్వీ (23) బీటెక్ పూర్తి చేశాడు. ఉద్యోగం నిమిత్తం గత ఏడాది నగరానికి వచ్చాడు. ఎల్లారెడ్డిగూడలోని ఓ బాయిస్ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నాడు. కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్స్‌కు బానిసై అప్పుల పాలయ్యాడు. డబ్బుల కోసం చోరీ చేయాలని భావించి ఈ నెల 12న ఎల్లారెడ్డిగూడ శాలివాహననగర్ కాలనీలోని నివాసం ఉంటున్న విజయలక్ష్మి(75) ఇంట్లోకి దూరాడు. వంటగదిలో వంట చేస్తున్న ఆమె మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నాగపృథ్వీ హాస్టల్‌కు వెళ్లి అతని వివరాలు సేకరించి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. దోపిడీ చేసిన బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని అతన్ని రిమాండ్‌కు తరలించారు.

షేక్‌పేటలో ఓట్ల గల్లంతు..

- బీజేపీ నాయకుల ధర్నా

బంజారాహిల్స్, మే 13(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో ఉన్న ఓట్లు లోక్‌సభ ఎన్నికల్లో కనిపించకపోవడంతో బీజేపీ ఆందోళనకు దిగింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గం షేక్‌పేటలో రెండు కాలనీలకు చెందిన దాదాపు 3000 ఓట్లు గల్లంతయ్యాయి. ఎన్నికల అధికారులు పార్టీలకు జారీ చేసిన జాబితాలో ఈ ఓట్లు ఉండగా పోలింగ్ అధికారుల జాబితాలో కనిపించలేదు.

వీరంతా గత అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఓటు వేశారని ఇప్పుడు కూడా అవకాశం ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కానీ ఎవరూ పట్టించుకోలేదు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి లంకల దీపక్‌రెడ్డి, సెంట్రల్ జోన్ ఉపాధ్యక్షురాలు కీర్తిరెడ్డి పోలింగ్ కేంద్రం వద్ద ధర్నాకు దిగారు. తొలగించిన వారికి ఓటు హక్కు ఇప్పించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి షేక్‌పేటకు చేరుకున్నారు. ఎన్నికల అధికారులను ప్రశ్నించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొందరు అధికారులు పథకం ప్రకారం బీజేపీకి పడాల్సిన ఓట్లను తొలగించారని ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు చెప్పారు.


అధికారులను ప్రశ్నిస్తున్న బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి, నాయకులు లంకల దీపక్‌రెడ్డి, కీర్తిరెడ్డి

టీ తాగేందుకు ఆగిన పద్మారావుగౌడ్, గోపీనాథ్

- పెద్ద ఎత్తున చేరుకున్న బీఆర్ఎస్ శ్రేణులు.. ఉద్రిక్తత

ఎర్రగడ్డ, మే 13(ఆంధ్రజ్యోతి): చాయ్ తాగేందుకు హోటల్ వద్ద సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆగడంతో పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. పోలింగ్ సరళిని తెలుసుకునేందుకు బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్, మాగంటి గోపీనాథ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పర్యటించారు. బోరబండ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అనంతరం మోతీనగర్ మిడ్‌ల్యాండ్ కేఫ్ వద్ద బ్లూస్టార్ హోటల్‌లో టీ తాగేందుకు ఆగారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద యెత్తున అక్కడకు చేరుకున్నారు. పోలీసులు అక్కడకు చేరుకొని అభ్యంతరం వ్యక్తం చేశారు. హోటల్ కూకట్‌పల్లి నియోజకవర్గంలోకి వస్తుంది కదా ఇక్కడ కూడా టీ తాగోద్దా అంటూ కార్యకర్తలు ప్రశ్నించారు. పోలీసులు, కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. చివరకు పోలీసులు కార్యకర్తలను పంపించేశారు. బోరబండ డివిజన్ నాయకుడు విజయ్ సింహారెడ్డిని అదుపులోకి తీసుకున్నా రు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ప్రయాణిస్తున్నకారును సీజ్ చేస్తామని పోలీసులు తెలిపారు. దీంతో పద్మారావుగౌడ్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధం ఎలా ప్రవర్తిస్తారంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యే కారు సీజ్ చేస్తే తాను బైఠాయిస్తానని హెచ్చరించారు. దీంతో పోలీసులు వెనక్కి తగ్గారు. పశ్చిమ మండలం డీసీపీ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకొని పరిస్థితిని సద్దు మణిగేలా చేసి హోటల్‌ను మూయించారు.

ఇబ్బందిపడ్డ వృద్ధులు

ఎర్రగడ్డలోని డాన్ బాస్కో స్కూల్‌లోని ప్రధాన ద్వారం నుంచి 315 పోలింగ్ కేంద్రం వరకు 100 మీటర్ల దూరం ఉంది. నడవలేని స్థితిలో ఉన్న కొంతమంది వృద్ధులతో పాటు వారికి సహాయంగా వెళ్తామన్నా పోలీసులు లోపలికి పంపలేదని ఓటర్లు ఆరోపిస్తున్నారు. శతాధిక వృద్ధుడు వీల్ చైర్‌లో వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రత్యేకంగా నిలిచింది. 323 పోలింగ్ కేంద్రంలో నడవలేని స్థితిలో కూడా ఓ వృద్ధురాలు రెండు పక్కల ఇద్దరి సహాయంతో పోలింగ్ కేంద్రానికి వచ్చి తన ఓటు హక్కును వినియోగించుకుంది.

పోలీసులు, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం

బంజారాహిల్స్, మే 13(ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల వద్ద టేబుల్ వేసే విషయంలో పలు చోట్ల కాంగ్రెస్ నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావునగర్ డివిజన్‌లో ఒకే చోట నాలుగు పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. దాదాపు 4000 మంది ఓటర్లు ఉండడంతో నాలుగు చోట్ల టేబుల్ వేసి పోలింగ్ ఏజెంట్లను కాంగ్రెస్ కూర్చోబెట్టింది. కాని మధురానగర్ పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ టేబుళ్లు ఎత్తేశారు. విషయం తెలుసుకున్న సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎన్నికల ప్రధాన ఏజెంట్ మామిడి నర్సింగరావు అక్కడకు చేరుకొని టేబుల్ ఎలా ఎత్తేస్తారంటూ పోలీసులను నిలదీశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారమే టేబుళ్లు వేసినట్టు చెప్పారు. పోలీసులు వినిపించుకోలేదు. దీంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది.

ఖైరతాబాద్‌లో 50.14 శాతం పోలింగ్

ఖైరతాబాద్ / బంజారాహిల్స్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ ఉదయం 7 గంటలకే ప్రారంభం కాగా.. 9 నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు ఎక్కువ పోలింగ్ శాతం నమోదైందని అధికారులు తెలిపారు. సాయంత్రానికి ఓటింగ్ శాతం మందగించింది. చాలా ప్రాంతాల్లో ఓటర్ స్లిప్‌లు అందకపోవడంతో ఓటు ఎక్కడ వేయాలో క్రమ సంఖ్య తెలుసుకోవడానికి కాస్త ఇబ్బంది పడ్డారు. మరికొందరు ఓటరు జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొత్తం 50.14 శాతం పోలింగ్ జరిగింది.

మొరాయించిన ఈవీఎంలు, వీవీ పాట్‌లు

ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉదయం మూడు ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించాయి. ఖైరతాబాద్ డివిజన్‌లో బూత్ నెంబరు 52తో పాటు మరో రెండు చోట్ల ఈవీఎంలు మాక్ పోల్ అనంతరం మందగించాయి. అరగంట తర్వాత టెక్నీషియన్లు, పివోలు ఈవీఎంలను సరిచేయడంతో ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీవీపాట్లు సైతం మొరాయించాయి. నియోజకవర్గంలో 5 చోట్ల 2.9, 2.7 ఎర్రర్లు చూపిస్తుండడంతో 5 చోట్ల వీవీ పాట్లను అధికారులు మార్చారు. అనంతరం పోలింగ్ సాఫీగా సాగింది.

50శాతానికి పైనే అయినప్పటికీ గతంతోపోలిస్తే ఇది ఎక్కువే అని పరిశీలకులు చెబుతున్నారు. పలు బస్తీల్లో పోలింగ్ బూత్‌లో 800పై చిలుకు ఓటర్లు ఉన్నప్పటికీ 200ఓట్లు కూడా పోలవ్వలేదు. కాలనీలో మాత్రం 60శాతానికి పైగా ఓటింగ్ జరిగింది. గతంలో ఎన్నడులేని విధంగా కాలనీ వాసులు ఓటు వేశారు. జూబ్లీహిల్స్ కాలనీలు, ఎంపీ ఎమ్మెల్యే కాలనీ, ఎమ్మెల్యే కాలనీ, ఫిలింనగర్ కాలనీలు, ప్రశాసన్‌నగర్ తదితర ప్రాంతాల్లో 62 శాతానికి పైగా పోలింగ్ జరిగినట్టు సమాచారం.

అనుచరులు, కార్యకర్తలతో సరదాగా..

ఎన్నిక ప్రచారం ముగిసిన అనంతరం ఓటింగ్ జరుగుతుండగా అభ్యర్థులు తమ అనుచరులు, కార్యకర్తలతో సరదాగా కనిపించారు. బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావు తన అనుచరుడైన చందు ద్విచక్ర వాహనంపై కూర్చొని ఖైరతాబాద్‌లోని పలు పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ సరళిని పరిశీలించి కొద్దిసేపు సరదాగా గడిపారు. కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ పోలింగ్ ముగిశాక ఖైరతాబాద్‌లో గొద్దిసేపు పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో ముచ్చటించి స్థానిక ప్యారడైజ్ హోటల్‌లో చాయ్ తాగారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి తన కార్యకర్తలతో కలిసి చాయ్ తాగారు.

జూబ్లీహిల్స్‌లో 45 శాతం

ఎర్రగడ్డ: ఎర్రగడ్డ డివిజన్‌లోని 45శాతం పోలింగ్ జరిగిందని అధికారులు తెలిపారు. తమ ఓట్లు గల్లంతయ్యాయని పలు కాలనీల ఓటర్లు ఆందోళనకు దిగారు. బోరబండ డివిజన్ బంజారానగర్‌లో పోలింగ్ బూత్ నెంబరు 265లో ఈవీఎం మొరాయించడంతో అరగంట ఆలస్యంగా పోలింగ్ మొదలైంది. రహ్మత్‌నగర్ డివిజన్, షేక్‌పేటలో నాల్గు చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. అధికారులు సరిచేసి ఓటింగ్ కొనసాగేలా చేశారు.

అమీర్‌పేటలో..

అమీర్‌పేట, మే 13 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట డివిజన్‌లో 42 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఎస్ఆర్‌నగర్‌లోని నారాయణ కళాశాలలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాష్ రాజ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకోగా, నారాయణ మెడికల్ కళాశాలలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ఓటు వేశారు.

ఎస్ఆర్‌నగర్‌లోని రోడ్లు భవనాల శాఖ కార్యాలయంలో సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన ఓటు వేశారు. పోలింగ్ శాతం ఉదయం 7 నుంచి సాయంత్రం 5గంటల వరకు 42.15 శాతం ఓట్లు పడ్డాయి.



ఎల్.నారాయణ నగర్‌లో వృద్ధురాలిని ఓటువేయటానికి తీసుకు వెళుతున్న జీహెచ్ఎంసీ సిబ్బంది, సహాయకురాలు



శ్రీనివాస్‌నగర్‌లో ఓటర్లకు స్లిప్‌లు అందజేస్తున్న సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ, యువనాయకుడు పోగర్తి భువనరావు



తుకారాంగేట్ షిరిడీ సాయిబాబా హైస్కూలు వద్ద ఉన్న పోలింగ్ కేంద్రంలో ఓటర్లు భారీగా క్యూ కట్టారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు కొంత మంది మాత్రమే ఓటు వేయగా 10 గంటల నుంచి 12 గంటలవరకు భారీగా ఓట్లు వేసేందుకు క్యూ కట్టారు.



ఓటు హక్కు వినియోగించుకున్న మెట్టుగూడ కార్పొరేటర్ సునీత

లష్కర్‌లో పోలింగ్ ప్రశాంతం

లష్కర్‌లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6గంటలకు ముగిసింది. సికింద్రాబాద్, సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పోలింగ్ జరగగా, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో కంటోన్మెంట్ ఉప ఎన్నిక, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ పోలింగ్ జరిగింది. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుల్ల పద్మారావు సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి శాసనసభ్యునిగా ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ఈ అసెంబ్లీ నియోజకవర్గంతోపాటు పొరుగునే ఉన్న సనత్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌పై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. స్థానికుడినైన తనను గెలిపించాలంటూ ఈ రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పద్మారావు, ఆయన అనుచరులు పదే పదే చేసిన అభ్యర్థనకు ఓటర్ల స్పందన ఎలా ఉంటుందోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

- సికిందాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ జోన్ బృందం

సికింద్రాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో పోలింగ్ శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. సిట్టింగ్ శాసనసభ్యురాలు జి.లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో మరణించడంతో సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు ఉప ఎన్నిక వచ్చిన సంగతి విదితమే. కాగా లోక్‌సభ ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ ఉపఎన్నిక పోలింగ్... రెండూ ప్రశాంతంగా జరిగాయి. గత కొద్ది రోజులతో పోలిస్తే శుక్రవారం ఎండ తక్కువగా ఉండడంతో ఉదయం 7గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. కాలనీలు, బస్తీల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్దకు ఓటర్లు ఉత్సాహంగా తరలివచ్చారు. మధ్యాహ్నం 12గంటల తర్వాత పోలింగ్ శాతం మందగించింది. తిరిగి సాయంత్రం 4.30గంటల తర్వాత ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కోసం తరలివచ్చారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని 8వ వార్డులు, జీహెచ్ఎంసీ పరిధిలోని మోండ మార్కెట్ డివిజన్‌లో పోలింగ్ సందర్భంగా అధికార యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. కాగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత, కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్, బీజేపీ అభ్యర్థి వంశ తిలక్‌లతోపాటు ఆయా పార్టీల నాయకులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ శాతాన్ని పరిశీలించడంతోపాటు ప్రత్యర్థుల కదలికలను గమనించారు. తమకు అనుకూలంగా ఉన్న ఓటర్లు పోలింగ్ బూత్‌కు వచ్చిందీ, లేనిదీ ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుంటూ వచ్చారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుకర్ నాయక్ పర్యవేక్షణలో అధికారులు నిరంతరం సమీక్షించారు.

తిరుమలగిరి, బొల్లారం పరిధుల్లో....

తిరుమలగిరి మే 13 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ సాధారణ ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ నియోజకవర్గం ఉప ఎన్నికల సందర్భంగా ఆదివారం జరిగిన పోలింగ్ తిరుమలగిరి, బొల్లారం పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ప్రశాంతంగా ముగిసింది. బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో 9 పోలింగ్ స్టేషన్‌లు, 18 బూత్‌లు ఉన్నాయి. అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు పౌరులు తమతమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం కొంత మందకొడిగా సాగినా, ఎండ తీవ్రత తగ్గగానే ఓటర్లు పోలింగ్ బూత్‌లకు చేరుకుని తమ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. అదేవిధంగా తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో 16 పోలింగ్ స్టేషన్‌లతో పాటు, 33 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. అన్నింటిలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఇన్‌స్పెక్టర్ విజయ్ పోలింగ్ స్టేషన్‌లు అన్నీ కమాండ్ కంట్రోల్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 100మంది ఫోర్స్‌తో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

బన్సీలాల్‌పేట్‌లో పోలింగ్ ప్రశాంతం

పద్మారావునగర్ : బన్సీలాల్‌పేట్‌లో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని బన్సీలాల్ పేట్ డివిజన్‌లోని అరవై పోలింగ్ బూత్‌లలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం ఉదయం వాతావరణం కొద్దిగా ఆహ్లాదకరంగా ఉండటంతో ఉదయం నుంచే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవటానికి ఓటింగ్ కేంద్రాల వద్ద క్యూకట్టారు. మొదటిసారిగా ఓటు హక్కును వినియోగించుకొంటున్న యువ ఓటర్లు తమ తల్లి దండ్రులతో, తాత, అమ్మమ్మలతో ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకొన్నారు. పద్మారావునగర్ ఎస్‌పీ కళాశాల కేంద్రంలో వృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకొని యువతకు ఆదర్శంగా నిలిచారు. కేంద్రంలో ర్యాంప్ నిర్మాణం సరిగాలేక వీల్‌చైర్లలో వృద్ధులను తరలించటానికి వాలంటీర్లు ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఎస్‌పీ కళాశాల వద్ద పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లను అనుమతించటంలేదని పలువురు ఓటర్లు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. ఓటు వేయటానికి పోలింగ్ కేంద్రాలకు చేరుకొన్న కొంత మందికి ఓటర్ల జాబితాలో పేర్లులేక నిరాశతో వెనుతిరగడం గమనార్హం. గాంధీ ఆస్పత్రి పక్కనగల ఏజ్డ్ హోమ్‌లోని వృద్ధులు కేంద్రంలోని సిస్టర్ సహాయంతో ఓటుహక్కును వినియోగించుకొన్నారు.



సీతాఫల్‌మండిలో ఓటు హక్కు వినియోగించుకున్న బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి, తుకారాంగేట్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కంటెస్టెడ్ ఎమ్మెల్యే సంతోష్ కుమార్



సీతాఫల్‌మండి ఉప్పరబస్తీలో పోలింగ్‌బూత్ 51లో తండ్రి పృథ్వీరాజ్‌తో కలిసి ఓటువేసిన సినీహీరో కార్తీక్



ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్న అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి , భర్త లింగాని శ్రీనివాస్



మడ్‌ఫోర్టు స్కూల్‌లో సతీమణితో సహా ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్సీ కనుకుల జనార్దన్‌రెడ్డి



అడ్డగుట్ట డివిజన్‌లో ఉన్న ఓటింగ్ కేంద్రాలను సందర్శించిన జీహెచ్ఎంసీ ట్యాక్స్ సెక్షన్ ఇన్‌చార్జిలు



న్యూబోయినపల్లి పోలింగ్ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్



తార్నాకలోని సెయింట్ అన్స్ హైస్కూల్‌లో సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్న జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి దంపతులు



తార్నాకలోని నాగార్జుననగర్ కమ్యూనిటీ హాల్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్న జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బండ కార్తీకా రెడ్డి దంపతులు



తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్న బీజేపీ మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు



సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో తమ ఓటు హక్కును వినియోగించుకున్న తార్నాక డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతి హరి దంపతులు

సీతాఫల్‌మండి, బౌద్ధనగర్‌లలో..

రెండుచోట్ల గంటపాటు మొరాయించిన ఈవీఎంలు

బౌద్ధనగర్ : సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఎటువంటి అల్లర్లకు తావులేకుండా ఓటర్లు క్యూలో నిల్చుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం ఏడుగంటలకు ప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం ఆరుగంటల వరకు ప్రశాంతంగా సాగాయి. బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్లో ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బందులు పడకుండా మంచినీటి సౌకర్యం, వైద్యశిబిరాలతో పాటు వృద్ధులను తీసుకువెళ్లటానికి వీల్‌చైర్‌లతో పాటు సహాయకులను ఏర్పాటు చేశారు. సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంతోపాటు పలు కేంద్రాలను బీజేపీ అభ్యర్థి గంగాపురం కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్‌లు పరిశీలించారు. బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ ద్విచక్ర వాహనంపై తిరుగుతూ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

నగర పోలీస్ కమిషన్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి చిలకలగూడలో పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ కె.శ్రీనివాసరావు, ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు సైదులు, అనుదీప్‌లు పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. కార్పొరేటర్లు సామల హేమ (సీతాఫల్‌మండి), కంది శైలజ (బౌద్ధనగర్), బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్, కన్వీనర్ కందాడి నాగేశ్వర్‌రెడ్డి, టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాసరావు, ముఖ్యనాయకులు కరాటేరాజు, పోగర్తి భువనరావు, మధురానగర్‌కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నామాలగుండు ఉప్పరబస్తీలో పోలింగ్ బూత్ 51లో యువహీరో కార్తీక్ తన తండ్రి పృథ్వీరాజ్‌తో కలిసి ఓటువేశారు. సీతాఫల్‌మండిలోని పోలింగ్ బూత్(147), ఎల్.నారాయణనగర్‌లోని పోలింగ్ బూత్(161)లో ఈవీఎంలు గంటపాటు మొరాయించటంతో కొద్దిసేపు అంతరాయం కలిగింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఉదయాన్నే ఓటింగ్ కేంద్రానికి చేరుకున్న ఓటర్లు

అడ్డగుట్ట, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఎండ తీవ్రత కారణంగా సికింద్రాబాద్ నియోజక వర్గం అడ్డగుట్ట డివిజన్‌లో ఉన్న ఓటింగ్ కేంద్రానికి ఉదయం ఏడు గంటలకే ఓటర్లు చేరుకున్నారు. ఉదయం 12 తరువాత ఎండ ఎక్కువ కావడంతో ప్రజలు ఓట్లు వేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లలో ఉన్న కేంద్రంలో ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా మంచినీటి సౌకర్యాలు కల్పించారు. వృద్ధులు ఓటు వేసేందుకు ముందుకు వచ్చారు.

స్లిప్‌లు పంపిణీ చేయలేదు : ఓటర్లు

ఈసారి ఎన్నికల్లో ఒక పార్టీ నాయకులు తప్ప మరే పార్టీ ఓటింగ్ స్లిప్‌లు పంచలేదని కొందరు ఓటర్లు అభిప్రాయపడ్డారు. తాము బతికి ఉన్నప్పటికీ లిస్టులో తమ పేరు లేకపోవడంతో మానసికంగా ఇబ్బందులు పడ్డామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఎన్నికల్లో ఓటు వేసిన తమకు ఈసారి ఓట్ల జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవని ప్రశ్నించారు.

యువ ఓటర్ల కోసం మోడల్ పోలింగ్ కేంద్రాలు



యువ ఓట్ల కోసం ఏర్పాటుచేసిన మోడల్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న యువ ఓటర్లు



కంటోన్మెంట్ బోయినపల్లిలో యువ ఓట్ల కోసం ఏర్పాటుచేసిన మోడల్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసి బయటకు వస్తున్న యువ ఓటర్లు

బోయినపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): యువ ఓటర్లను చైతన్యపర్చడానికి ప్రత్యేకంగా మోడల్ పోలింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా బోయినపల్లిలోని యువ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కేంద్రంలో సిబ్బంది యువతీ యువకులే నిర్వహించారు. కాగా యువతీ యువకులు ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం వారిని ఆకర్షించడం కోసం ఈ కేంద్రంలో ప్రత్యేక బ్యానర్లు, బెలూన్‌లు ఏర్పాటు చేశారు. దీంతో ఈ కేంద్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీంతో ఓటు వేసిన అనంతరం యువ ఓటర్లు సెల్ఫీలు దిగారు.



తొలిసారి ఓటుహక్కును వినియోగించుకుని సీతాఫల్‌మండి మల్టీపర్పస్ పోలింగ్ కేంద్రం వద్ద ఫొటోలు దిగుతున్న యువతి



బౌద్ధనగర్ నేతాజీ స్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేయటానికి బారులు తీరిన మహిళలు



బౌద్ధనగర్‌లో ఓటుహక్కును వినియోగించుకున్న టీడీపీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్‌కుమార్

నివేదితకు సానుభూతి పని చేస్తుందా?

- అధికార పార్టీ అండ శ్రీగణేష్‌కు కలిసి వస్తుందా?
- కంటోన్మెంట్ ఎన్నికల ఫలితంపై సర్వత్రా ఆసక్తి

సికింద్రాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): సిట్టింగ్ శాసనసభ్యులుగా అధికారంలో ఉన్న సమయంలోనే తండ్రి సాయన్నను, చెల్లి లాస్య నందితను కోల్పోవడంతో పెల్లుబికిన సానుభూతి నివేదితను గట్టెక్కిస్తుందని బీఆర్ఎస్ శ్రేణులు ధీమాగా ఉండగా, అధికార పార్టీ అండదండలతో ఎన్నికల బరిలో నిలిచినందున ఎన్.శ్రీగణేష్‌ను విజయతీరాలకు చేరుస్తుందని కాంగ్రెస్ పార్టీ క్యాడర్ నమ్ముతోంది. సిట్టింగ్ శాసనసభ్యురాలు లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మరణించడంతో వచ్చిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నిక ఫలితంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. వివిధ రకాల ఒత్తిళ్లు, ప్రలోభాలకు లొంగకుండా గులాబీ పార్టీనే నమ్ముకుని పనిచేసిన కంటోన్మెంట్ పాలకమండలి మాజీ సభ్యులు, ద్వితీయ శ్రేణి నాయకులతో పాటు మల్కాజిగిరి శాసనసభ్యుడు మర్రి రాజశేఖరరెడ్డి, అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డిలు అనుక్షణం గట్టిగా పనిచేయడంతో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం చివరి క్షణం వరకు జోరుగా సాగింది. ఇంటింటికీ పాదయాత్ర, బహిరంగ సభలు, కార్నర్ మీటింగ్‌లు, కుల సంఘాలు, యువజన సంఘాలు, మహిళలతో ప్రత్యేక సమావేశాలు, రోడ్ షోలు తదితర రూపాల్లో విస్తృత ప్రచారం చేయడం, ప్రతి వేదికపై నివేదిత తన తండ్రి సాయన్న, చెల్లి లాస్య నందితలను ప్రజలకు గుర్తుచేయడంతో పోలింగ్ తేదీ వరకు సానుభూతి కొనసాగిందని గులాబీ పార్టీ విశ్వసిస్తోంది. ముఖ్యంగా మహిళలు నివేదితను ఆదరించిన తీరును చూస్తే తమ గెలుపు ఎప్పుడో ఖాయమైందని ఆ పార్టీ నేతలు పలుమార్లు ధీమా వ్యక్తం చేశారు. ఆయా సభలు, సమావేశాల్లో నివేదిత ఉద్వేగానికి లోనైతే పలువురు మహిళలు కంటి తడిపెట్టిన షయాన్ని వారు గుర్తుచేశారు. చివరకు.... ప్రత్యర్థి పార్టీలైన కాంగ్రెస్, బీజేపీల్లోని కీలక నాయకులు, వారి అనుచరులు సైతం సాయన్న కుటుంబంపై సానుభూతి ప్రదర్శించారని, పోలింగ్‌లో కొన్ని వేల ఓట్ల వరకు తమకు క్రాస్ ఓటింగ్ జరిగిందని వారు భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆయా పార్టీల నాయకులలో చాలా మంది వారి అభ్యర్థులకు ఓటు వేసి ఉంటారని, అసెంబ్లీ ఎన్నికల విషయానికి వచ్చేసరికి సానుభూతితో నివేదితకు ఓటు వేసి ఉంటారని బీఆర్ఎస్ నాయకులు గట్టిగా నమ్ముతున్నారు. వీటితోపాటు బీఆర్ఎస్ హయాంలో నగరంలో జరిగిన అభివృద్ధి, కంటోన్మెంట్ ప్రజలకు సైతం రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించిన అంశాలను తాము సమర్థవంతంగా ఓటర్లకు వివరించగలిగామని, తద్వారా ఉప ఎన్నికలో నివేదిత విజయం ఖాయమని వారు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా,... గడిచిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నదని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం, కాంగ్రెస్ పార్టీ తరపున శ్రీగణేష్ పోటీలో ఉండడంతో ప్రజలు హస్తం గుర్తుపై అత్యధిక శాతం ఓటు వేశారని ఈ పార్టీ నాయకులు భావిస్తున్నారు. అధికార పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే అభివృద్ధి సాధ్యమనే నినాదాన్ని గట్టిగా ప్రజల్లోకి తీసుకువెళ్లగలిగామని, చివరి నాలుగు రోజుల్లో అధిష్టానం ఆదేశాలతో వచ్చిన కీలక నాయకుల ప్రభావం, వారి పనితీరుతో గణేష్ విజయావకాశాలు పెరిగాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు భరోసాగా ఉన్నారు.

సాయంత్రం వేళలో కనిపించని ఓటర్లు



అడ్డగుట్ట ప్రభుత్వ స్కూలులో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆరు గంటలకు మూసి వేస్తున్న ఎన్నికల అధికారి



ఆరు గంటల తరువాత ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లు

అడ్డగుట్ట, మే 13 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు నేపథ్యంలో సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్‌లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. ఉదయం ఏడు గంటల నుంచి 11 గంటలకు వరకు కనిపించిన ఓటర్లు, మధ్యాహ్నం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కూడా ఓటర్లు కనిపించకుండాపోయారు. డివిజన్‌లో ఉన్న కేంద్రాలు సాయంత్రం ఆరు గంటలకే గేట్లను ఎన్నికల అధికారులు మూసివేశారు. అక్కడక్కడ కేంద్రాలను మూసివేసిన తరువాత కూడా ఒకరిద్దరు ఓటర్లు కేంద్రానికి రావడంతో ఓటర్లను సమయం అయిపోయిందని పోలీసులు వెనక్కి పంపించారు. చాలామందికి ఓటర్ కార్డులు ఉన్నప్పటికీ తమ పేర్లు డిలీట్ కావడంతో 20 శాతం ఓటర్లు ఓట్లు వేయలేకపోయారు. అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావును గెలిపించాలన్న తపనతో గ్రూపు సభ్యులకు మాత్రమే డబ్బులు పంచినట్లు మిగతావాళ్లకు డబ్బులు ఇవ్వకపోవడంతో చాలామంది ఓటర్లు కార్పొరేటర్‌పై మండిపడ్డారు. చాటుమాటుగానే కొంత మందికి మాత్రమే డబ్బులు పంచారన్న వదంతులు వ్యాపించాయి. కింది స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తలు చురుకుగా ప్రచారంలో పాల్గొన్నప్పటికీ డబ్బులు పంచే సమయంలో ఓటర్లకు కార్పొరేటర్ చేతివాటం చూపించారంటూ పలు ఆరోపణలు వచ్చాయి.

ప్రశాంత వాతావరణంలో బందోబస్తు

తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అంబటి అంజనేయులు ఏరియాలో గట్టి బందోబస్తు నిర్వహించారు. ఓటింగ్ రోజు ఒక రోజు ముందుగానే ఎక్కడా ఎలాంటి గొడవలు జరగకుండా భారీ బందోస్తు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తు ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ జరగడం ఇదే మొదటిసారి. ప్రతి ఎన్నికల్లో అక్కడక్కడ గొడవలు జరిగినప్పటికి ఈసారి ఎలాంటి గొడవలు జరగకుండా సీఐ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. మధ్యరాత్రి సమయంలో ఎక్కడా కూడా వివిధ పార్టీల నాయకులు డబ్బులు పంపకాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.